


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| గురువారం 04 జూన్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 02 సంచిక : 002 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

# దక్షిణాఫ్రికా పెట్టుబడిదారులకు తెలంగాణలో స్వాగతం: సీఎం రేవంత్ రెడ్డి





సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 4, ప్రతినిధి: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్న దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలకు అవసరమైన అన్ని సహకారాలను తెలంగాణ ప్రభుత్వం అందించడానికి సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ సంస్థలో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ పాలస్ షిపొకోసా మష్టైల్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా కలిసింది. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ – దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, పారిశ్రామిక మరియు ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశాలపై సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణం, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి వివరించారు. భారత్ అధికారిక పర్యటనలో భాగంగా తెలంగాణకు వచ్చిన మష్టైల్ బృందానికి ముఖ్యమంత్రి ప్రత్యేక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మష్టైల్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం, ప్రజలు తమ బృందానికి అందించిన ఆత్మీయ ఆహ్వానం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, శాస్త్ర సాంకేతిక, పెట్టుబడి సహకార రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత విస్తరించాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. భారతదేశంలోని యువ రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచి, తక్కువ కాలంలోనే జాతీయ స్థూల దేశీయోత్పత్తికి గణనీయమైన వాటా అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల పట్టుదల, సృజనాత్మకత, సంకల్పబలం ఈ విజయాలకు నిదర్శనమని కొనియాడారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ భారత్ – దక్షిణాఫ్రికా సంబంధాలకు చారిత్రక నేపథ్యం ఉందని, సాంకేతికత, ఔషధ తయారీ, వ్యాక్సిన్లు, రక్షణ, ఏరోస్పేస్, పరిశోధన, విద్య, ఆరోగ్యం, తయారీ, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు మరియు మౌలిక సదుపాయాల రంగాల్లో తెలంగాణ విశేష ప్రగతి సాధించిందని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ మరియు సుస్థిర అభివృద్ధి రంగాల్లో తెలంగాణ వేగంగా ముందుకు సాగుతోందని, దక్షిణాఫ్రికా కంపెనీలు తెలంగాణలో పెట్టుబడి అవకాశాలను పరిశీలించాలని ఆహ్వానించారు.

# పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై కేటీఆర్ ఘాటు స్పందన




సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 4, ప్రతినిధి: తెలంగాణపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఘాటుగా స్పందించారు. "తెలంగాణ ఏమైనా మీ అయ్య జాగీరా?" అంటూ పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ, "తెలంగాణ ఖచ్చితంగా ఈ భూమి పుత్రుల జాగీరే. ఈ నేల కోసం పోరాడిన వాళ్లు, త్యాగాలు చేసిన వాళ్లు, రక్తం చిందించిన వాళ్లది తెలంగాణ" అని అన్నారు. "మీరు ఇక్కడ ఉండండి, వ్యాపారాలు చేసుకోండి, కుటుంబాలతో జీవించండి.. ఎవరూ వద్దనలేదు. కానీ వచ్చి మా సచివాలయంలో కూర్చొని పెత్తనం చేస్తామంటే ఒప్పుకోం" అని స్పష్టం చేశారు. ప్రాంతీయ భావాలపై పవన్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ "పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన ఉద్యమం కూడా ప్రాంతీయ భావమేనా?" అని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపిస్తూ "ఆర్థిక ప్రాంతీయ భావం సరైందా?" అని నిలదీశారు. "దేశభక్తి గురించి మాకు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదు. నిజాం వ్యతిరేక పోరాటాలు చూసిన నేల ఇది" అని వ్యాఖ్యానించారు. "ఒక నటుడిగా పవన్ కళ్యాణ్‌ను అభిమానిస్తాం.. ఇంటికి వస్తే హైదరాబాదీ బిర్యానీ పెడతాం. కానీ తెలంగాణపై పెత్తనం అంగీకరించం" అని అన్నారు. జనసేన తెలంగాణలో పోటీ చేయడంపై స్పందిస్తూ "ఈ దేశంలో ఎక్కడైనా పార్టీ పెట్టే హక్కు అందరికీ ఉంది. కానీ ఇక్కడి ప్రజల భావోద్వేగాలు, త్యాగాలు తెలుసుకుని మాట్లాడాలి" అని సూచించారు. చివరగా "మాకు తెలంగాణలో అసలైన నాయకుడు మా కేసీఆర్ గారే" అంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కేటీఆర్ ప్రశంసలు కురిపించారు.

# మాస్కోలో ఏపీ పెట్టుబడులు – ఆధునిక రవాణా భాగస్వామ్యంపై కీలక చర్చలు





సందేశం టైమ్స్, మాస్కో, జూన్ 4, ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు మరియు ఆధునిక రవాణా వ్యవస్థల అభివృద్ధిపై మాస్కోలో కీలక చర్చలు జరిగాయి. ప్రపంచంలో ప్రముఖ అల్యూమినియం సంస్థలలో ఒకటైన రుసాల్ వ్యవస్థాపకుడు ఒలేగ్ డెరిస్పాస్కోతో రాష్ట్ర ప్రతినిధి బృందం సమావేశమై అల్యూమినియం రంగంలో భాగస్వామ్య అవకాశాలపై చర్చించింది. భారతదేశ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో అల్యూమినియం వినియోగం రోజురోజుకూ పెరుగుతోందని, మొబిలిటీ, పునరుత్పాదక శక్తి, నిర్మాణం, ఎలక్ట్రానిక్స్ మరియు ఆధునిక తయారీ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని ప్రతినిధులు పేర్కొన్నారు. లోహాలు, ఖనిజాలు మరియు డౌన్‌స్ట్రీమ్ తయారీ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ కీలక కేంద్రంగా ఎదుగుతోందని, ఇప్పటికే రుసాల్ సంస్థ రాష్ట్రంలో అల్యూమినా రిఫైనరీ పెట్టుబడులు కలిగి ఉండటంతో భవిష్యత్తులో మరింత సహకారం ద్వారా నాణ్యమైన ఉపాధి అవకాశాలు, పెట్టుబడులు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మాస్కో అడ్వాన్స్‌డ్ ట్రాన్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించిన ప్రతినిధి బృందం అక్కడి ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థను ప్రశంసించింది. మెట్రో, బస్సులు, రైళ్లు, బైక్ షేరింగ్, స్కూటర్ నెట్‌వర్క్‌ల సమగ్ర అనుసంధానం, కృత్రిమ మేధస్సు ఆధారిత ట్రాఫిక్ నిర్వహణ, స్మార్ట్ టికెటింగ్, రియల్ టైమ్ భద్రతా వ్యవస్థలతో మాస్కో ప్రపంచ స్థాయి రవాణా మౌలిక వసతులను అభివృద్ధి చేసిందని పేర్కొన్నారు. భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలు కూడా ఇలాంటి సాంకేతిక ఆధారిత సమగ్ర రవాణా పరిష్కారాలను అవలంబిస్తే ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. మాస్కో ట్రాన్స్‌పోర్ట్ బృందం అందించిన ఆతిథ్యం, నిర్వహించిన చర్చలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని ప్రతినిధులు తెలిపారు.



# తెలంగాణ – జర్మనీ థూరింగియా మధ్య కీలక ఒప్పందం

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 4, ప్రతినిధి: రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న శాస్త్ర సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు మరియు జీవ వైజ్ఞానిక రంగాల్లో పరస్పర సహకారాన్ని విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం మరియు జర్మనీకి చెందిన థూరింగియా రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. భారత్ పర్యటనలో భాగంగా థూరింగియా రాష్ట్ర మినిస్టర్-ప్రెసిడెంట్ మారియో ఫోకట్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు ప్రభుత్వాల మధ్య ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. తెలంగాణ దేశంలోనే అభివృద్ధి, ఆవిష్కరణలకు అగ్రగామిగా నిలుస్తోందని మారియో ఫోకట్ పేర్కొన్నారు. భారత్–జర్మనీ ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రత్యేక స్థానం సంపాదించుకుందని కొనియాడారు. పరస్పర ప్రయోజనాలు కల్పించే అవకాశాలను మరింత విస్తరించుకోవాలని ఆకాంక్షించారు. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు యుగంలో మారుతున్న ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను పునర్నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి అభివృద్ధి చెందిన దేశాల అవసరాలను తీర్చగలిగే విధంగా స్కిల్లింగ్ కార్యక్రమాలు ఉండాలని అభిప్రాయపడ్డారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, పాలిటెక్నిక్ విద్యాసంస్థల పాఠ్యాంశాల ఆధునీకరణలో థూరింగియా సహకారం అందించాలని కోరారు. దీనికి స్పందించిన మారియో ఫోకట్ తెలంగాణ–థూరింగియాలోని పరిశ్రమలు, విద్యాసంస్థల భాగస్వామ్యంతో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను సంయుక్తంగా రూపొందించవచ్చని తెలిపారు. ప్రపంచ టెక్నాలజీ రంగ అభివృద్ధిలో తెలంగాణకు చెందిన మానవ వనరులు కీలక పాత్ర పోషిస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సిలికాన్ వ్యాలీ వంటి అంతర్జాతీయ టెక్నాలజీ కేంద్రాల్లో తెలంగాణ ప్రతిభ విశేషంగా రాణిస్తోందన్నారు. కృత్రిమ మేధస్సు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జర్మన్ వంటి విదేశీ భాషల శిక్షణతో పాటు సమగ్ర నైపుణ్యాభివృద్ధి అవసరమని చెప్పారు. థూరింగియా సహకారంతో హైదరాబాద్‌లో జర్మన్ లాంగ్వేజ్ ట్రైనింగ్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. జర్మనీ పరిశ్రమలకు అవసరమయ్యే మానవ వనరులను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా తీర్చగలమని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి పెట్టుబడులు, ఆవిష్కరణలకు కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యాలను కూడా ముఖ్యమంత్రి వివరించారు. ఫార్చ్యూన్-500 కంపెనీలను ఆకర్షించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని ప్రస్తావిస్తూ 2025 మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా 100కు పైగా దేశాల ప్రతినిధులకు విజయవంతంగా ఆతిథ్యం ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. నైపుణ్యాభివృద్ధి, సాంకేతికత, ఆవిష్కరణలు, పెట్టుబడుల రంగాల్లో థూరింగియాతో భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. జర్మనీకి చెందిన సెమీకండక్టర్ కంపెనీల ప్రత్యేక ప్రతినిధి బృందాన్ని తెలంగాణకు తీసుకువచ్చి పెట్టుబడి అవకాశాలను పరిశీలించేలా చర్యలు తీసుకుంటామని మారియో ఫోకట్ వెల్లడించారు. తెలంగాణ పరిశ్రమల అవసరాలను తీర్చడంలో థూరింగియా కట్టుబడి ఉందన్నారు. మంత్రి శ్రీధర్ బాబు ఈ ప్రతిపాదనను స్వాగతించగా, మంత్రి వివేక్ వెంకటస్వామి తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ ద్వారా జర్మన్ భాషా శిక్షణ, విదేశీ ఉపాధి అవకాశాల కల్పనలో రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధిస్తోందని వివరించారు. సమావేశంలో థూరింగియా రాష్ట్ర ఉన్నతాధికారులు, చెన్నైలోని జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్, ఆప్టిక్స్, ఫోటోనిక్స్, ప్రిసిషన్ ఇంజినీరింగ్, లైఫ్ సైన్సెస్, మెడ్‌టెక్, రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ముఖ్యమంత్రికి ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక తదితరులు హాజరయ్యారు.




# జూన్ 5 నుంచి తెలంగాణలో కొత్త భూముల రిజిస్ట్రేషన్ విలువలు అమలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 4, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో సవరించిన భూముల రిజిస్ట్రేషన్ విలువలు జూన్ 5 నుంచి అమల్లోకి రానున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మార్కెట్ ధరలకు అనుగుణంగా భూముల రిజిస్ట్రేషన్ విలువలను సవరించినట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. భూముల మార్కెట్ విలువల సవరణను శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామని మంత్రి పేర్కొన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనం, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కొత్త విలువలను నిర్ణయించినట్లు వెల్లడించారు. కొత్త రిజిస్ట్రేషన్ రేట్ల అమలుతో ప్రభుత్వ ఆదాయం పెరగడంతో పాటు రియల్ ఎస్టేట్ లావాదేవీలు మరింత పారదర్శకంగా మారనున్నాయని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల్లో జూన్ 5 నుంచి సవరించిన విలువల ప్రకారం రిజిస్ట్రేషన్లు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

# తెలంగాణలో పలు జిల్లాలకు వాతావరణ హెచ్చరిక

**మెరుపులు.. ఈదురు గాలులతో భారీ వర్ష హెచ్చరిక,ఉరుములతో ఉక్కిరిబిక్కిరి కానున్న తెలంగాణ.. 12 జిల్లాలకు అలర్ట్**

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 4, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర సమగ్ర వాతావరణ మార్పు కేంద్రం హెచ్చరికల మేరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తదుపరి 24 గంటల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని హెచ్చరించారు. ఆదిలాబాద్, హనుమకొండ, జనగామ, కుమురం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్ జిల్లాలకు ఈ హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు వెళ్లాలని, రైతులు పంటలను రక్షించుకునే చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు. ఉరుములు, మెరుపుల సమయంలో ఎలక్ట్రానిక్ పరికరాల ప్లగ్‌లను తొలగించాలని సూచించారు. హెచ్చరికల పరిధిలో ఉన్న జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.



# సంగారెడ్డి జిల్లా నూతన డీఈఓగా ఆర్. రోహిణి బాధ్యతల స్వీకరణ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 4, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నూతన జిల్లా విద్యాశాఖాధికారిగా ఆర్. రోహిణి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై సంగారెడ్డి జిల్లాకు వచ్చి అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు డీఈఓగా సేవలందించిన వెంకటేశ్వర్లు బదిలీపై రంగారెడ్డి జిల్లాకు వెళ్లగా, ఆయన స్థానంలో ఆర్. రోహిణిని ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆర్. రోహిణి మాట్లాడుతూ విద్యా రంగంలో తనకున్న అనుభవాన్ని జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి వినియోగిస్తానని తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, ప్రభుత్వ విద్యా సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు.

# తెలంగాణ రక్షణ సేన రాష్ట్రానికి ప్రత్యామ్నాయ శక్తి: డా. నలమాస శ్రీకాంత్ గౌడ్



సందేశం టైమ్స్, మహబూబాబాద్, జూన్ 4, ప్రతినిధి: తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర రాజకీయాల్లో బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందని పార్టీ మానుకోట జిల్లా ఇంచార్జ్ డా. నలమాస శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని షాదీఖానాలో మహబూబాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ గంధసిరి వేణు ఆధ్వర్యంలో జిల్లా నాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మానుకోట జిల్లా ఇంచార్జ్ డా. నలమాస శ్రీకాంత్ గౌడ్, రాష్ట్ర పరిశీలకులు కిషన్ నాయక్, రెండు నియోజకవర్గాల రాష్ట్ర పరిశీలకులు అభిలాష్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ జెండా గద్దెల కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన నిర్వహించేందుకు సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలి దశలో జిల్లాలోని 18 మండలాలు, మూడు మున్సిపాలిటీల్లో కార్యక్రమాన్ని చేపట్టి అనంతరం అన్ని గ్రామాలకు విస్తరించనున్నట్లు వెల్లడించారు. రాబోయే రెండేళ్లలో తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. పార్టీ ప్రకటించిన పాంచజన్య హామీలను ప్రజల్లోకి తీసుకెళితే ప్రజలే టీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడతారని అన్నారు. గిరిజన జిల్లాగా ఉన్న మానుకోటలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికార, ప్రతిపక్ష నాయకులు స్పందించడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్ష నాయకులు ప్రశ్నించకుండా మౌనంగా ఉండటం బాధాకరమన్నారు. అనంతరం సుమారు 100 మంది యువకులు డా. శ్రీకాంత్ గౌడ్ సమక్షంలో తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ ఇంచార్జ్ బోడ అనిల్ నాయక్, జిల్లా నాయకులు సట్ల శోభ, నాగిరెడ్డి, అసిఫ్ అలీ, శ్యామ్ గౌడ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# అస్వస్థతకు గురైన పులి హన్మంత్‌ను పరామర్శించిన మంత్రి దామోదర రాజనర్సింహ



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 4, ప్రతినిధి: మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని పాల్వంచ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పులి హన్మంత్ అస్వస్థతకు గురై సంగారెడ్డి బాలాజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. హన్మంత్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడిన మంత్రి, ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



# జోగిపేటలో ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 4, ప్రతినిధి: మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆదేశాల మేరకు మాజీ ఏఎంసీ చైర్మన్ డి.బి. నాగభూషణం మరియు చాపల వెంకటేశం ఆధ్వర్యంలో జోగిపేట పట్టణంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి. హరీష్ రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆరడుగుల బుల్లెట్, ట్రబుల్ షూటర్, జనహృదయ నేతగా పేరుగాంచిన హరీష్ రావుకు ఆయురారోగ్యాలు కలగాలని, మరిన్ని ఉన్నత పదవులు అధిష్ఠించి ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని భగవంతుణ్ణి ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ నాయకత్వంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ నాయకుడు హరీష్ రావు అని కొనియాడారు. ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధికి, అందోల్ నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేసిన నాయకుడిగా ఆయనను ప్రశంసించారు. జోగిపేట పట్టణ ప్రజల తరఫున, నియోజకవర్గ ప్రజల తరఫున హరీష్ రావుకు హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బిర్ల శంకర్, మహేష్ యాదవ్, శంకర్ రావు, రఫిక్, పెండా గోపాల్, దాసరి దుర్గయ్య, మన్నే మారుతి, మన్నే పరిపూర్ణం, మొగులయ్య, పల్లె వెంకటరమణ, పోచయ్య, నాసర్ ఖాన్, బరుడి వీరేశం, పట్లూరి శ్రీనివాస్, బాజీ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# హరీష్ రావు జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించిన మాద్రి పృథ్వీరాజ్



| పటాన్చెరువు

సందేశం టైమ్స్, పటాన్చెరు, జూన్ 4, బి డేవిడ్: మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదిన సందర్భంగా పటాన్చెరు నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో అమీన్‌పూర్‌లోని దినేష్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేసి, వారి సమక్షంలో హరీష్ రావు జన్మదిన కేక్‌ను కట్ చేసి వేడుకలు జరిపారు. అనంతరం పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ ఆధ్వర్యంలో శివనగర్‌లోని శిరీష చారిటబుల్ ట్రస్ట్‌లో చిన్నారుల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించి, కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ రెండు కార్యక్రమాల్లో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని వృద్ధులు, చిన్నారులతో కలిసి వేడుకల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. సేవే లక్ష్యంగా, ప్రజలే కుటుంబంగా ముందుకు సాగుతున్న హరీష్ రావుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# బదిలీపై వెళ్తున్న ఫీల్డ్ ఆఫీసర్‌కు ఘన సన్మానం



సందేశం టైమ్స్, చింతకాని, జూన్ 4, ప్రతినిధి: చింతకాని కేంద్ర సహకార బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ఊదారపు నాగేశ్వరరావు బదిలీపై మధిర బ్యాంకుకు వెళ్లుచున్న సందర్భంగా బ్యాంకు సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన బ్యాంకుకు అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ పలువురు కొనియాడారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రీటా, సొసైటీ అధ్యక్షులు నల్లమోతు శేషగిరిరావు, కార్యదర్శులు వై. శ్రీనివాసరావు, ఎం. శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ వంకాయలపాటి దీపిక, క్యాషియర్ జి. లావణ్య, సిబ్బంది అసిస్టెంట్ ఎం. భవ్య, మెసింజర్ పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణపై ప్రతి పౌరుడికి సామాజిక బాధ్యత ఉండాలి





సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 4, సంగమేశ్వర్: తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సహకారంతో జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు మరియు కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ, జిల్లా పర్యావరణ ఇంజనీర్ ఎన్. విజయలక్ష్మి సంయుక్త ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పర్యావరణ ఇంజనీర్ విజయలక్ష్మి మాట్లాడుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు రావడమే కాకుండా జంతు, వృక్షజాల మనుగడకే ప్రమాదమని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణంపై అవగాహన కలిగి ఉండి కాలుష్యానికి కారణమయ్యే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. దానికి బదులుగా జనపనార, కాగితం, వస్త్రాలతో తయారైన వస్తువులను వినియోగిస్తే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. "సింగిల్ యూస్ ప్లాస్టిక్ నివారణలో యువత పాత్ర" అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలో జి. మహేష్ గౌడ్ ప్రథమ, ఎన్. సంతోష్ కుమార్ ద్వితీయ, ఆండ్రూ తృతీయ స్థానాలు సాధించగా, "ఘన వ్యర్థాల నిర్వహణ–పౌరుల బాధ్యత" అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో జి. మహేష్ గౌడ్ ప్రథమ, ఎన్. సంతోష్ కుమార్ ద్వితీయ, ఎం. సిద్ధార్థ తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత యువతపై ఉందని విజయలక్ష్మి పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి జ్యూట్ బ్యాగులు, వస్త్ర బ్యాగులు, పేపర్ బ్యాగుల వినియోగాన్ని పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ మరియు ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జగదీశ్వర్, జిల్లా పర్యావరణాధికారి మాధవ రెడ్డి, జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 4, ప్రతినిధి: ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో గ్రామ, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. గ్రామ, వార్డు సభలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి కుటుంబం మొక్కలు నాటేలా చైతన్యం కల్పించాలని, రహదారుల వెంట పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించి అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని సూచించారు. మురుగుకాల్వల శుభ్రత, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఇండ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్లపైకి వెళ్లకుండా కమ్యూనిటీ, వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. మహిళల రక్షణ, బాల్య వివాహాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, రహదారి భద్రతపై 'అరైవ్ అలైవ్' కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో భారీ వర్షాలు, వాగులు పొంగే పరిస్థితుల్లో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. వనమహోత్సవంలో భాగంగా లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు సిద్ధం చేసుకోవాలని, ప్రకృతి విపత్తుల ప్రతిస్పందన బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పంటల అవశేషాలను కాల్చకుండా కలియదున్నాలని సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సభల్లో పోలీస్ అధికారులు పాల్గొని ప్రకృతి వైపరీత్యాలు, పిడుగులు, రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. 10వ తేదీన ప్రతి గ్రామసభలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమాలు నిర్వహించాలని, రహదారి సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. 12వ తేదీన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సభలు నిర్వహించాలని తెలిపారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యుత్, విద్య, ప్రణాళిక తదితర శాఖల అధికారులు, మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.



# టేక్మాల్‌లో ఘనంగా మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 4, ప్రతినిధి: అందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండల కేంద్రంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు 54వ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప, సిద్ధయ్య నాయక్, కోటి భాస్కర్, సాయిబాబా, రమేష్ నాయక్, చౌహన్ రవి తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి




సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 4, ప్రతినిధి: టేక్మాల్ మండలంలోని రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నాణ్యమైన విత్తనాలు అందించి రైతన్నల అభ్యున్నతికి సహకరించాలని టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ సుధాకర్, మండల తహసీల్దార్ తులసిరాం, టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మరియు కుసంగి గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్ సూచించారు. టేక్మాల్ మండల కేంద్రంలోని గొల్లగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన "అన్నదాత ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్" దుకాణాన్ని ఎల్లంపల్లి గ్రామ యువ నాయకుడు చాతగిరి సంగమేశ్వర్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, మండల సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు, యువజన నాయకులు, మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఖమ్మం వైరా రోడ్డులో కుంగిన మెయిన్ రోడ్డు.. ట్రాఫిక్‌కు అంతరాయం



సందేశం టైమ్స్, ఖమ్మం, జూన్ 4, ప్రతినిధి: ఖమ్మం నగరంలోని వైరా రోడ్డు అకస్మాత్తుగా కుంగిపోవడంతో భారీ బొరియ ఏర్పడింది. జిల్లా కోర్టు సమీపంలోని లకారం చెరువుకు వెళ్లే కాల్వ వద్ద ప్రధాన రహదారి కుంగిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఘటనతో అప్రమత్తమైన అధికారులు వెంటనే ట్రాఫిక్‌ను వన్ వే విధానంలో నియంత్రిస్తూ వాహనాల రాకపోకలను మళ్లించారు. కుంగిన రహదారికి తక్షణ మరమ్మతు పనులు ప్రారంభించినట్లు సమాచారం. రహదారి మరింత కుంగిపోకుండా భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.



## మాజీ ఎంపీ బాగారెడ్డి 20వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

సందేశం టైమ్స్, జహీరాబాద్, జూన్ 4, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో మాజీ ఎంపీ, ప్రజానాయకుడు బాగారెడ్డి 20వ వర్ధంతి సందర్భంగా ఆయనకు కుటుంబ సభ్యులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగారెడ్డి సమాధి వద్ద ఆయన తనయుడు ఎం. జైపాల్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాగారెడ్డి ప్రజాసేవకు అంకితమైన నాయకుడిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, రైతాంగ సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలు, విలువలు నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజలకు సేవ చేయడమే నిజమైన నివాళి అని అన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, అభిమానులు బాగారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బిచ్చి రెడ్డి, అడవి రెడ్డి, పాండురంగారెడ్డి, సూర్ రెడ్డి, భాస్కర్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహాదేవ్‌పల్లి గ్రామ సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, జూన్ 4, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కల్హేర్ మండల పరిధిలోని మహాదేవ్‌పల్లి గ్రామంలో గ్రామ సమాఖ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్హేర్ మండల సమాఖ్య ఏపీఎం వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సమాఖ్యలు మహిళల ఆర్థిక అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపు, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలులో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మహిళలు సంఘటితంగా ముందుకు సాగి ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. అనంతరం మహాదేవ్‌పల్లి గ్రామ సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా గులాపల్లి లక్ష్మి, కార్యదర్శిగా గుల మోగులవ్వ, కోశాధికారిగా గులాపల్లి అనిత, ఉపాధ్యక్షురాలిగా బైండ్ల కృష్ణవేణి, ఉప కార్యదర్శిగా చిన్నం మంజుల బాధ్యతలు స్వీకరించారు. నూతన కార్యవర్గ సభ్యులను వంశీకృష్ణ అభినందిస్తూ గ్రామ సమాఖ్య అభివృద్ధితో పాటు మహిళల సంక్షేమం, స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ బేబీ, గ్రామ స్థాయి బాధ్యుడు బాలయ్య, ఈసీ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేరేడిగుంట గ్రామంలో సర్పంచ్ ఆర్థిక సాయం.. మృతుడికి నివాళులు



సందేశం టైమ్స్, అందోల్, జూన్ 4, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ మండల పరిధిలోని నేరేడిగుంట గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఒక కుటుంబంలో మరణం సంభవించడంతో గ్రామ సర్పంచ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి తనవంతుగా రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, యువ నాయకులు, గ్రామస్థులు కలిసి మృతుడి పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తరఫున మరిన్ని సహాయ సహకారాలు అందించాలని గ్రామస్థులు కోరారు.




## బోరంచలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం

సందేశం టైమ్స్, మానూర్, జూన్ 4, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండల పరిధిలోని బోరంచ గ్రామంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి. సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యలో రాణించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివకుమార్ స్వామి, యశ్వంత్, ఉపాధ్యాయులు మహేష్ కుమార్, అశోక్ రావు, శ్రీధర్, విఠల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యురాలు సాయమ్మ, అంగన్వాడీ టీచర్లు, మహిళా సమాఖ్య వీఓఏ అనుసుయ, గ్రామస్తులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జోగిపేటలో క్షీణించిన పారిశుద్ధ్యం.. అధికారుల పరిశీలన



సందేశం టైమ్స్, అందోల్, జూన్ 4, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ మండల పరిధిలోని జోగిపేట పట్టణంలో పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో మున్సిపల్ అధికారులు బుధవారం సంబంధిత ప్రాంతాలను పరిశీలించారు. రహదారుల పక్కన చెత్త పేరుకుపోవడం, డ్రైనేజీలు సక్రమంగా శుభ్రం చేయకపోవడం, చెత్త సేకరణలో నిర్లక్ష్యం వంటి అంశాలను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బందితో కలిసి పలు కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో ఎక్కడైనా చెత్త పేరుకుపోయినట్లు గుర్తిస్తే వెంటనే తొలగించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం మున్సిపాలిటీ బాధ్యత అని పేర్కొంటూ, చెత్తను రోడ్లపై వేయకుండా ప్రజలు కూడా సహకరించాలని సూచించారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులను మరింత వేగవంతం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## మాట నిలబెట్టుకున్న భట్టి విక్రమార్క.. మధిరకు ఐటీ హబ్ మంజూరు



GOVERNMENT OF TELANGANA
INFORMATION TECHNOLOGY, ELECTRONICS & COMMUNICATIONS DEPARTMENT

Lr.No.2396029/ITE&C/Prom/2024 dt:01.06.2026

From
The Special Chief Secretary to Government (FAC)
ITE&C Department
Room No.24, 3rd floor,
Dr. B.R.Ambedkar Telangana Secretariat
Hyderabad

To
The Vice Chairman & Managing Director
TGIIC Ltd
6th floor, Parisrama Bhavanam
5-9-58/B, Fateh Maidan Road
Basheerbagh, Hyderabad

Sir,

Sub: ITE&C Dept – Construction of IT Hub/Tower in the land admeasuring Acs.1.16 gts in Sy.No.43 situated at Madhira Village and Mandal, Khammam District – Administrative Sanction accorded - Reg.

Ref: 1. Lr.No.241702/TGIIC/Lands/Yendapalli-KMM/25, dt:20.02.2026 of VC & MD, TGIIC Ltd.
2. Lr.No.241702/TGIIC/Lands/Madhira-KMM/26, dt:26.04.2026 of VC & MD, TGIIC Ltd.

******

With reference to the letters of TGIIC cited above, Government after careful examination, hereby accord administrative sanction for construction of IT Hub/Tower in the land admeasuring Acs.1.16 gts in Sy.No.43 situated at Madhira Village and Mandal, Khammam District.

2. TGIIC shall prepare estimates/detail project cost and send the proposal to the Government for according budgetary sanction.

3. The VC & MD, TGIIC Ltd is requested to take further necessary action accordingly.

Yours faithfully,

for Special Chief Secretary to Govt (FAC)



సందేశం టైమ్స్, మధిర, జూన్ 4, ప్రతినిధి: గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేర్చుతూ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మధిర నియోజకవర్గానికి ఐటీ హబ్ మంజూరు చేశారు. మధిరలో ఐటీ హబ్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేసింది. మధిర గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 43లో ఉన్న 1.16 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఐటీ టవర్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థకు (TGIIC) ప్రాథమిక అంచనాలు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (DPR) త్వరితగతిన సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రాజెక్టుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపుల కోసం తగిన నివేదికలను సమర్పించాలని సూచించింది. ఈ ఐటీ హబ్ ఏర్పాటుతో స్థానిక యువతకు సాఫ్ట్‌వేర్ రంగంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మధిరను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై స్థానిక ప్రజలు, యువత, మేధావులు హర్షం వ్యక్తం చేశారు.



## మధిరలో ఘనంగా మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు

సందేశం టైమ్స్, మధిర, జూన్ 4, ప్రతినిధి: మాజీ రాష్ట్ర మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను మధిరలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధిర పట్టణంలోని 100 పడకల ఆసుపత్రి వద్ద జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లింగాల కమల్ రాజు మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో మధిర ప్రాంత ప్రజల ఆకాంక్ష మేరకు 100 పడకల ఆసుపత్రి కోసం అప్పటి ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న హరీష్ రావు గారు రూ.34 కోట్ల నిధులు మంజూరు చేయించారని గుర్తు చేశారు. ఆసుపత్రి నిర్మాణం వేగంగా పూర్తై ప్రజలకు అందుబాటులోకి రావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. హరీష్ రావు ఆరోగ్య, ఆర్థిక శాఖల్లో తనదైన ముద్ర వేసిన సమర్థ నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బిక్కి కృష్ణప్రసాద్, పల్లపోతు వెంకటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు చిత్తారు నాగేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్ యన్నంశెట్టి అప్పారావు, అరిగే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పాలడుగులో ఘనంగా మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు



సందేశం టైమ్స్, వట్పల్లి మండలం, జూన్ 4, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల పరిధిలోని పాలడుగు గ్రామంలో మాజీ మంత్రి, ప్రస్తుత సిద్దిపేట్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఆగమయ్య, టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు విటల్ రెడ్డి, సీనియర్ నాయకులు బి. విటల్, యువజన అధ్యక్షుడు బి. మధుసూదన్, నిరంజన్, మహేష్, అంజయ్య, నర్సింలు, నర్సిములు, భార్గవ్, అనిల్, రాజు, రాకేష్, లక్ష్మణ్, జగన్, రాహుల్, గురుదాస్, శ్రీశైలం, రమేష్, ఎం. నాగేష్, బాలు, పాపయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హరీష్ రావు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తూ తెలంగాణ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు.

## తహసీల్దార్‌గా పదోన్నతి పొందిన రాజు పటేల్‌కు అభినందనలు




సందేశం టైమ్స్, నారాయణఖేడ్, జూన్ 4, ప్రతినిధి: నారాయణఖేడ్ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రాజు పటేల్ తన ప్రతిభ, కృషి, విధి నిర్వహణలో చూపిన నిబద్ధతకు గుర్తింపుగా తహసీల్దార్‌గా పదోన్నతి పొందారు. నారాయణఖేడ్‌లోనే డిప్యూటీ తహసీల్దార్‌గా సేవలందించిన ఆయనకు అదే ప్రాంతంలో తహసీల్దార్‌గా ప్రమోషన్ రావడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా సహోద్యోగులు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు మరియు పలువురు ప్రముఖులు రాజు పటేల్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఆయన మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.



## ఖమ్మంలో ఘనంగా మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు

సందేశం టైమ్స్, ఖమ్మం, జూన్ 4, ప్రతినిధి: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టి శుభాకాంక్షలు తెలిపారు. వక్తలు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ నాయకత్వంలో కీలక పాత్ర పోషిస్తూ రాష్ట్ర సాధన, అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు హరీష్ రావు అని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాల కృష్ణ, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్, సీనియర్ నాయకులు ఉప్పల వెంకటరమణ, లీగల్ సెల్ ప్రతినిధి బిచ్చాల తిరుమలరావు, బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, ముత్యాల వెంకటప్పారావు, తాజుద్దీన్, శీలంశెట్టి వీరభద్రం సహ పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ అవార్డులతో రాష్ట్రానికి గుర్తింపు.. అత్యుత్తమ సేవలు అందించాలి: పవన్ కళ్యాణ్




సందేశం టైమ్స్, అమరావతి, జూన్ 4, ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ వరుసగా రెండో ఏడాది జాతీయ స్థాయి పురస్కారాలు అందుకోవడం పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారాల సాధనలో భాగస్వాములైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది, సర్పంచులు, వార్డు సభ్యులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. న్యూఢిల్లీలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రం తరఫున అవార్డులు స్వీకరించిన ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణ తేజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ అవార్డులు గ్రామీణ స్థానిక సంస్థల పనితీరు, ప్రజాప్రతినిధుల నిబద్ధత, అధికారుల సమష్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. అవార్డుల స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా పని చేసి గ్రామీణాభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ ఏడాది రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ జాతీయ స్థాయిలో మొత్తం ఐదు అవార్డులు గెలుచుకోగా, తిరుపతి జిల్లా బొక్కసంపాలెం మహిళలకు స్నేహపూర్వక వాతావరణం గల పంచాయతీల విభాగంలో ప్రథమ స్థానం దక్కించుకుంది. సుపరిపాలన విభాగంలో విశాఖ జిల్లా శృంగవరం తొలి స్థానం సాధించగా, పేదరిక నిర్మూలన, జీవనోపాధి విభాగంలో చెమ్మెళ్లపల్లి రెండో స్థానంలో నిలిచింది. స్వయం సమృద్ధి విభాగంలో గుండమల, అత్యుత్తమ మండలాల విభాగంలో కుప్పం మూడో స్థానంలో నిలిచాయి.

## ఖాదిరాబాద్ గ్రామంలో జొన్నల కొనుగోలు సబ్ సెంటర్ ఏర్పాటు



సందేశం టైమ్స్, అందోల్, జూన్ 4, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం వట్పల్లి మండల పరిధిలోని ఖాదిరాబాద్ గ్రామంలో జొన్నల కొనుగోలు సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈసారి వట్పల్లి మండలంలో జొన్నల పంట అధికంగా పండడంతో దేవునూర్, మరవెల్లి కొనుగోలు కేంద్రాల్లో రద్దీ పెరిగి రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులు మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఖాదిరాబాద్‌లో కొత్త సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మండల వైస్ చైర్మన్ మన్నె ఈశ్వరయ్య, వట్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రతాప్ రమేష్, జ్యోషి వంశీ, వార్డు మెంబర్ దశరథ్, కె. కిష్టాగౌడ్, రాంరెడ్డి, నర్సింలు, ఎల్లారెడ్డి, అన్ను తదితరులు పాల్గొన్నారు. వెంటనే స్పందించి సబ్ సెంటర్ ఏర్పాటు చేసినందుకు రైతులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




## భూముల మార్కెట్ విలువల సవరణ శాస్త్రీయంగా చేపట్టాం: మంత్రి పొంగులేటి

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 4, ప్రతినిధి: రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువలను శాస్త్రీయంగా, హేతుబద్ధంగా సవరించి ఈ నెల 5వ తేదీ నుంచి అమల్లోకి తెస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి ప్రకటించారు. రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం మేరకు వాస్తవ మార్కెట్ ధరలకు అనుగుణంగా భూముల విలువలను క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు ఆర్థిక నిపుణులు అరవింద్ సుబ్రమణ్యం నివేదిక, ఉన్నతాధికారుల సూచనలు, క్షేత్రస్థాయి అధ్యయనాల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ప్రాంతాల వారీగా భూముల మార్కెట్ పరిస్థితులు, రిజిస్ట్రేషన్ల సంఖ్య, బహిరంగ మార్కెట్ ధరలు, ప్రభుత్వ విలువల మధ్య వ్యత్యాసాలను పరిశీలించి కొత్త రేట్లు నిర్ణయించినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సరైన అధ్యయనం లేకుండా భూముల ధరలను పెంచడంతో అనేక ప్రాంతాల్లో అసమానతలు ఏర్పడ్డాయని విమర్శించారు. రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువల పునర్విమర్శ చేపట్టి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సవరించిన విలువలను ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. ప్రాంతాల అభివృద్ధి, కొత్త రహదారులు, ORR, RRR, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. ఫ్లాట్ల విషయంలో మార్కెట్ ధరలకు అనుగుణంగా అన్ని అంతస్తులకు ఒకే రేటు వర్తించేలా హేతుబద్ధీకరణ చేసినట్లు చెప్పారు. నిర్మాణ సామగ్రి ధరలు, కార్మిక వ్యయాలు పెరగడంతో ఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణ రేట్లను కూడా సవరించినట్లు వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా, పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ ఈ మార్పులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఈ నిర్ణయం వల్ల భూ లావాదేవీలలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రభుత్వ ఆదాయం కూడా వృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

## పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు బాధాకరం: కూనంనేని సాంబశివరావు



సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 4, ప్రతినిధి: ఉప ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే విమర్శించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజే వచ్చి సవాళ్లు విసరడం సరికాదన్నారు. తెలంగాణకు రావద్దని ఎవరూ చెప్పలేదని, అపరిచితుడిగా వస్తానని వ్యాఖ్యానించడం అనవసరమని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి ఇక్కడే ఉండాలనుకుంటే ఎవరూ అడ్డుకోవరని వ్యాఖ్యానించారు. ఆంధ్రా-తెలంగాణ వివాదాలను రాజకీయ ప్రయోజనాల కోసం రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్న తర్వాత కూడా అనవసర రాద్ధాంతం చేయడం ఎందుకని ప్రశ్నించారు. కమ్యూనిస్టులపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, కమ్యూనిజం ఎప్పటికీ చావదని స్పష్టం చేశారు. తాము ప్రజల కోసం పనిచేస్తామని, పదవుల కోసం కాదని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని ఎవరూ అవమానించలేదని, ఆ పేరుతో వివాదాలు సృష్టించడం సరికాదన్నారు. తెలంగాణపై ప్రేమ లేకపోవడం వల్లే రాష్ట్ర విభజనను తప్పుపడుతున్నారని విమర్శించారు. ప్రాంతీయ వాదం పవన్ కళ్యాణ్ చర్యల వల్లే పెరుగుతోందని ఆరోపించారు. అధిక ధరలకు వ్యతిరేకంగా ఈ నెల 10న పెద్ద ఎత్తున పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తామని కూనంనేని సాంబశివరావు తెలిపారు.



## కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం

సందేశం టైమ్స్, బెంగళూరు, జూన్ 4, ప్రతినిధి: కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి తో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ మరియు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన డీకే శివకుమార్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో కర్ణాటక రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.



## ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం.. 18 మంది సజీవ దహనం

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, జూన్ 04, ప్రతినిధి: దేశ రాజధాని న్యూఢిల్లీ లోని మాలవీయ నగర్ ప్రాంతంలో బుధవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో భారీ విషాదం నెలకొంది. ఈ ప్రమాదంలో కనీసం 18 మంది సజీవ దహనం కాగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనాస్థలికి చేరుకున్న పది ఫైరింజన్లు మంటలను అదుపులోకి తెచ్చేందుకు గంటల తరబడి శ్రమించాయి. మంటలు రెస్టారెంట్ నుంచి సమీప భవనాలకు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పలువురు విదేశీయులు కూడా మృతుల్లో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ప్రధాని Narendra Modi ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.